క్లుప్తంగా

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామంలోని సుంకులా పరమేశ్వరి దేవాలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, అభిషేకాలు, అష్టోత్తర నామార్చన, మహామంగళ హారతి పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు


మాళ మల్లేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, పూల సేవ, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు కర్ణాటక, ఆంధ్రాకు చెందిన భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

11న చలో హైదరాబాద్


బోగోలులో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 11న శనివారం చేపట్టనున్న మాదిగల విశ్వరూప మహాసభలో పాల్గొనేందుకు చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ మండల కన్వీనర్ నాయకంటి గిడ్డయ్య తెలిపారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఆయా సమితుల మండల ప్రతినిధులు గత రెండ్రోజులుగా పలు గ్రామాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం చెర్లకొత్తూరు, బోగోలు, బింగిదొడ్డి, గోవర్ధనగిరి, సూదేపల్లె, బోయనపల్లె గ్రామాల్లో పర్యటించిన సమితి ప్రతినిధులు ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. నాయకంటి గిడ్డయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనకై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మండల నాయకులు బజారు, ప్రకాశ్, సూరి, రాజు, ఆయా గ్రామాల సమితి నాయకులు పాల్గొన్నారు.

ముళ్లకంపల తొలగింపు

కృష్ణగిరి: గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని బోయబొంతిరాళ్ల సర్పంచ్ రవిమోహన్ అన్నారు. మండల పరిధిలోని బోయబొంతిరాళ్ల గ్రామం నుంచి లింగనేనిదొడ్డి గ్రామం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లను ఆదివారం జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు నిత్యం డోన్‌కు వెళ్లాలంటే ఈ రహదారిలోనే వెళ్లాలని, దారి కంపచెట్లతో నిండిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించి ముళ్లకంపల తొలగింపు పనులు చేపట్టామన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

8న డోన్‌లో విద్యుత్ అదాలత్

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 8న డోన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు స్థానిక విద్యుత్ ఏఈ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. డోన్ డివిజన్ పరిధిలోని వెల్దుర్తి మండల విద్యుత్ వినియోగదారులు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే అదాలత్‌లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. డోన్ డీఈ కార్యాలయంలో జరిగే ఈ అదాలత్‌కు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు హాజరవుతారని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంగరాయుడికి వెన్న అలంకరణ

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలసిన మంగరాయుడికి ఆదివారం పుష్యార్కయోగం సందర్భంగా నవనీత (వెన్నతో) అలంకారం చేసినట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు తెలిపారు. పుష్యార్కయోగం సందర్భంగా మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థ శ్రీపాదుల ఆదేశాల మేరకు స్వామివారికి విశేష మధు అభిషేకం, ఫల పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం నవనీత (వెన్న) అలంకారం చేసినట్లు చెప్పారు. పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

- గ్రామ స్వరాజ్య స్థాపనలో సచివాలయాలే కీలకం
- పుల్లగుమ్మి సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


పుల్లగుమ్మి గ్రామ సచివాలయం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామ స్వరాజ్య స్థాపనలో సచివాలయ వ్యవస్థ కీలకమని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆదివారం ఆమె మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ నాగార్జున రెడ్డితో కలిసి ప్రారంభించారు. శిలాఫలకం ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు విన్నవించిన సమస్యలను సావధానంగా విని పరిష్కార దిశగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపుతోందన్నారు. పల్లెపల్లెలో నవ వసంతం వెల్లివిరుస్తోందన్నారు. చిన్న, చిన్న సమస్యల పరిష్కారానికి గతంలో నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులలో సచివాలయ వ్యవస్థ ద్వారా అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. కనీవినీ ఎరుగని రీతిలో గంటల వ్యవధిలోనే పరిష్కారం లభిస్తోందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేసేలా ఆర్బీకేలు, వీహెచ్‌సీల భవన నిర్మాణాలు నిర్దిష్ట ప్రణాళికతో పూర్తవుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా విద్యార్థులకు, ప్రజలకు ధ్రువీకరణ పత్రాల నుంచి, రైతుల సమస్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజారోగ్యం, ఆధార్ సేవలు, రిజిస్ట్రేషన్లు, సంక్షేమ పథకాల అమలు జరుగుతోందన్నారు. సచివాలయ ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యే ముందుగా అభయాంజనేయునికి, వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ దాదిపోగు సుంకన్న, తహసీల్దార్ శివరాముడు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు, గువ్వల నాయుడు, మధు, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్దికెరకు ఎమ్మెల్యే రాక

మద్దికెర: స్థానిక కమ్యునిటీ హాలులో సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొననున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంపల వెంకటేశులు ఆదివారం తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయికి సైన్స్ ప్రాజెక్టు ఎంపిక


విద్యార్థినులు ప్రియదర్శిని, మానసకు మొమెంటో, ప్రశంసా పత్రాలు అందిస్తున్న డీఈఓ రంగారెడ్డి

వెల్దుర్తి (కృష్ణగిరి): జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ-నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్) నిర్వహించిన జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శలో వెల్దుర్తి కేజీబీవీ 10వ తరగతి విద్యార్థిని ప్రియదర్శిని రూపొందించిన నమూనా ప్రాజెక్ట్ మొదటి స్థానంలో నిలవడంతోపాటు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కేజీబీవీ ఎస్‌ఓ షాకీరా బేగం ఆదివారం తెలిపారు. ప్రియదర్శిని ప్రదర్శించిన ద సిగ్నిఫికేషన్ ఆఫ్ మిల్లెట్స్ ఇన్ ద మాడ్రన్ వరల్డ్ (ఆధునిక ప్రపంచంలో చిరుధాన్యాల ప్రాధాన్యత) ప్రాజెక్టు ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. ప్రియదర్శినితోపాటు తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని మానస సైతం మరో ప్రాజెక్ట్‌ను ప్రదర్శించి మెప్పు పొందిందన్నారు. శనివారం కర్నూలు మాంటిస్సోరి స్కూల్‌లో ఎన్‌సీఎస్‌సీ కో-ఆర్డినేటర్ రంగమ్మ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో జిల్లాస్థాయి విజేత ప్రియదర్శిని, పాల్గొన్న మానసకు డీఈఓ రంగారెడ్డి చేతుల మీదుగా మొమెంటో, ప్రశంస పత్రం అందజేశారు.

తీవ్రమవుతున్న కుక్కల బెడద


హొళగుంద బస్టాండు వద్ద గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

హొళగుంద: మండల కేంద్రం హొళగుందతో పాటు పల్లెల్లో కుక్కల బెడద విపరీతంగా మారింది. ఇటీవల కాలంలో కుక్కల దాడులు పెరిగి పోతుండడంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. తాజాగా కోగిలతోట, ముద్దటమాగి గ్రామాలలో కుక్కలు దాడిలో గాయపడిన బాధితులు హొళగుంద పీహెచ్‌సీలో వ్యాక్సిన్ వేయించుకుంటున్నారు. వీధుల్లో, బస్టాండులో తిరుగుతున్న ఈ కుక్కలు ఉన్నట్టుండి చిన్నారులతో పాటు పెద్దలపై దాడులు చేస్తున్నాయి. కుక్క కాటుకు స్థానిక పీహెచ్‌సీలో రేబీస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని డాక్టర్లు న్యూటన్, బిందుమాధవి తెలిపారు. ఇదిలాఉండగా కుక్కల బెడదను నివారించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, బాధితులు కోరతున్నారు.

కుర్లేహళ్లిలో రీసర్వే పూర్తి


మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జున

హాలహర్వి: మండలంలోని కుర్లేహళ్లి గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కార్యక్రమం ద్వారా చేపట్టిన భూముల సమగ్ర సర్వే పూర్తయ్యిందని తహసీల్దార్ మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన గ్రామంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. రీసర్వే ఎలాంటి అడ్డంకులు లేకుండా సజావుగా సాగిందన్నారు. ఆధునిక పద్ధతిలో డిజిటల్ రెవెన్యూ రికార్డులు సిద్ధమవుతున్నాయని చెప్పారు. వీటిని పూర్తి చేసి భూయజమానులకు హక్కు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సర్వే చేపట్టడం జరిగిందన్నారు. సర్వే పూర్తయ్యాక భూహక్కు పత్రాలను యజమానులకు అందించడంతో పాటు క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లు గ్రామాల్లోనే జరిగేలా కొత్త మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, వీఆర్వో ఆంజనేయులు, ఎంపీటీసీ ప్రభాకర్‌గౌడ్, సర్వేయర్లు రోజా తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా పేదలకు వరంగా మారిందని గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో నామినీ గొల్ల మాణిక్యమ్మకు బీమా తక్షణ సాయం రూ.10 వేలు నగదు, ధ్రువీకరణ పత్రాన్ని సర్పంచ్ అందజేశారు. నామినీ భర్త గొల్ల పెద్ద రంగన్న అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా మంజూరైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ బీమా నిరుపేదలకు అండగా నిలుస్తోందన్నారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. అలాగే గొల్ల మాణిక్యమ్మకు వితంతు పింఛన్‌కు నమోదు చేయించామన్నారు. సచివాలయ కార్యదర్శి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు తాయన్న ఉన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మద్దికెర: ప్రస్తుతం ఉరుకు పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతత లేక ఎన్నో కష్టనష్టాలకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని, ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కో-ఆర్డినేటర్ పక్కీరప్ప అన్నారు. ఆదివారం మద్దికెరలోని శాంతివనం కేంద్రంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యాన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు ప్రతి ఒక్కరూ ఒత్తిడి, అలజడులు తట్టుకొని ఆధ్యాత్మికంగా ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితులు చేరుకోవడానికి ధ్యాన పద్ధతి సహకరిస్తుందన్నారు. ధ్యానం చేస్తూ జీవితాన్ని సుఖమయం చేసకోవాలని సూచించారు. కార్యక్రమంలో పుష్పావతమ్మ, గురుప్రకాష్ రెడ్డి, పద్మనాభం, చంద్రవల్లి, దశవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు


ఐరన్‌గల్లు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పనులు జరుగుతున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంత్రాలయం నియోజకవర్గంలో 5 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మంజూరు చేశారు. అందులో ఒకటైన ఐరన్‌గల్లు లిఫ్ట్ ఇరిగేషన్‌ను రూ.18 కోట్ల వ్యయంతో తుంగభద్ర నది ఒడ్డు నుంచి ఐరన్‌గల్లు గ్రామం వరకు పైప్‌లైన్ వేసి లిఫ్ట్ ద్వారా సాగునీటిని అందించేందుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇదివరకే పైప్‌లైన్ పనులు పూర్తి కాగా నది ఒడ్డున పంప్‌హౌస్, ఐరన్‌గల్లు వద్ద స్టోరేజ్ పనులు చేపడుతున్నారు. పనులు పూర్తయితే దాదాపు 1500 ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందుతుంది. వేగవంతంగా పనులు జరుగుతుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 'స్పందన' కార్యక్రమం

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీల రూపంలో ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు.

తెల్ల దోమతో ఇబ్బందులు

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో వర్షాభావ పరిస్థితుల వల్ల తెల్లదోమ పెరగడం వల్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లదోమ విపరీతంగా పెరిగి కళ్లలో పడుతుండడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక బయటికి వస్తే చాలు తెల్లదోమ కళ్లలో పడుతుందన్నారు. ఎక్కడ కూర్చున్నా కళ్ల ముందే తెల్లగా దోమలు వస్తుండడంతో ఏమవుతుందోనని భయపడిపోతున్నారు. పంచాయతీ అధికారులు తెల్లదోమ నివారణకు మందులు స్ప్రే చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి

ఆలూరు: సబ్ డివిజన్ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 44 బీటీ రోడ్ల పనులకు ఏబీఐ గ్రాంటు నుంచి సుమారు రూ.67 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని పీఐయూ డీఈ భాస్కర్ తెలిపారు. ఇప్పటివరకు 40 గ్రామాలకు సంబంధించి 28 బీటీ రోడ్లను పూర్తి చేయడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు సౌకర్యంగా మారిందన్నారు. రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

హెల్త్ కార్డులపై అవగాహన కల్పించండి

ఆలూరు: ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ అల్లబకాష్ వలంటీర్లను ఆదేశించారు. ఆయన ఆదివారం మట్లాడుతూ.. మండలంలో 212 మంది గ్రామ వలంటీర్లు, ఎస్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ ఆరోగ్య శ్రీ యాప్‌లో కుటుంబసభ్యుల ఫోన్ నంబర్, ఆధార్ కార్డులకు లింక్ చేయాలన్నారు. హెల్త్ కార్డుల వల్ల ఉపయోగాలను వివరించాలని సూచించారు. వలంటీర్లు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న 25 మంది వలంటీర్లపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు అందాయని తెలిపారు.


చిప్పగిరిలో కళకళలాడుతున్న మిరప పైరు

కరుణించిన వరుణుడు

చిప్పగిరి: ఎట్టకేలకు వరుణడు కరుణించి వర్షాలు కురిపిస్తుండడంతో అన్నదాతలు ఊరట చెందుతున్నారు. మండలంలో రైతులు ఖరీఫ్ ఆఖరు, రబీలో మిరప, కంది, ఆముదం, వేరుశనగ, పప్పుశనగ, పొద్దు తిరుగుడు తదితర పంటలు సాగు చేశారు. పంటలు వేసిందే మొదలు సరైన వర్షపాతం లేకపోవడంతో పైర్లు వాడుముఖం పట్టాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో గత రెండు రోజులుగా మండలంలో స్వల్పంగా వర్షాలు కురుస్తుండడంతో పైర్లకు జీవం పోసినట్లయ్యింది. కురుస్తున్నది తేలిక పాటి వర్షాలే అయినా పైర్లకు మేలు జరుగుతుందని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల్లో దైవచింతన పెంచాలి


స్థానిక క్రిష్టియన్ అసెంబ్లీ చర్చిలో విద్యార్థుల నాటక ప్రదర్శన

ఎమ్మిగనూరుటౌన్: పిల్లల్లో చిన్న వయసు నుండే దైవచింతన అలవరచాలని స్థానిక సెయింట్ పాల్ సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ జీవన్ సుకుమార్ బాబు సూచించారు. ఆదివారం ప్రపంచ సండే స్కూల్ దినోత్సవంలో భాగంగా స్థానిక చర్చిలో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. సండే స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయిని శ్రీదేవి ఆధ్వర్యంలో పలు నాటక ప్రదర్శనలను నిర్వహించారు. పిల్లలను పెంచే విషయంలో క్రమశిక్షణతో కూడిన శిక్షణ అవసరమని ఆయన ఈ సందర్భంగా సూచించారు. విద్యార్థులు బైబిల్ ఆధారంగా అనేక అంశాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. సంఘ పెద్దలు ఎలిజబెత్ సుకుమార్, సుదర్శన్‌రావు, రాజేంద్రప్రసాద్, వసతరావు, జాన్ మోజెస్, విజయకుమారి, జాస్లిన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక క్రిష్టియన్ అసెంబ్లీ చర్చిలో అబినేజర్ పవిత్రన్ ఆధ్వర్యంలో సండే స్కూల్ నిర్వహించారు. విద్యార్థులు బైబిల్ సంబంధించిన కథలు, నాటికలు ప్రదర్శించారు. సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు శిబిరాలకు విశేష స్పందన


ఓటరు నమోదు శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లికార్జున


హాలహర్విలో ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలిస్తున్న ఏపీఎం చిన్నవీరన్న

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని 52 పోలింగ్‌బూత్‌లలో శని, ఆదివారలు నిర్వహించిన ప్రత్యేక ఓటరు అవగాహన, ఓటరు జాబితా సవరణ సదస్సుకు విశేష స్పందన లభించింది. రెండ్రోజులలో మండల వ్యాప్తంగా ఫారం-6 (కొత్త ఓటరు నమోదుకు) దరఖాస్తులు 385, ఫారం-7 (తొలగింపులకు) దరఖాస్తులు 172, ఫారం-8 (మార్పులు, చేర్పులు) దరఖాస్తులు 54 వచ్చాయని తహసీల్దార్ శివరాముడు తెలిపారు. ఆదివారం ఆయన కలుగొట్ల, పుల్లగుమ్మి, బుక్కాపురం, కృష్ణాపురం గ్రామాలలోని పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న శిబిరాలను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు నమోదుకు, సవరణలకు డిసెంబర్ 9వ తేదీ వరకు అవకాశముందన్నారు. ప్రస్తుతం ఓటరు ముసాయిదా జాబితా తమ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, బీఎల్‌ఓల వద్ద అందుబాటులో ఉన్నాయని, అన్ని పార్టీల ప్రతినిధులకు అందించామన్నారు. అభ్యంతరాలు తెలిపే అవకాశముందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని, మరణించిన వారికి, డబుల్ ఓట్లకు సంబంధించి తగు ధ్రువపత్రాలు సమర్పిస్తే తొలగించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఆర్ఐ మస్తాన్, వీఆర్‌ఓలు ఉన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎన్టీఆర్ కాలనీ పాఠశాలతో పాటు పలు కేంద్రాల్లో ఓటరు నమోదుకై ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను తహసీల్దార్ ఆంజనేయులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో ఫారం-6 దరఖాస్తులు 476, ఫారం 68 దరఖాస్తులు 178, పారం 7 దరఖాస్తులు 130, ఫారం 8 దరకాస్తులు 214 వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

నందవరం: ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల సూపర్‌వైజర్లు ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఏపీఎం చిన్నవీరన్న సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 52 నుంచి 58 వరకు ఈఓపీఆర్డీ, హాలహర్వి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 45, 46లలో బీఎల్‌ఓలు చేపట్టిన ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఏపీఎం పరిశీలించారు. వారు మాట్లాడుతూ రెండు రోజులు బీఎల్‌ఓలు చేపట్టిన ఓటర్ల సవరణ, నమోదు ఫారం-6 దరఖాస్తులు 235, ఫారం-7 దరఖాస్తులు-88, ఫారం-8 దరఖాస్తులు-75 వచ్చాయని వివరించారు. బీఎల్‌ఓలు రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు ఆదివారం తెలిపారు. గతంలో ఓటరు లిస్టులో ఉన్నవారు ప్రస్తుతం ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో సరిచూసుకోవాలని సూచించారు. చనిపోయిన వారు పేర్లు ఓటరు జాబితాలో ఉంటే తొలగించేందుకు సంబంధిత ధ్రువపత్రాలు బూత్ లెవల్ ఆఫీసర్లకు అందజేయాలన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

ఆలూరు రూరల్: ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆలూరు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గుండాల్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని మొలగవెల్లి పోలింగ్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. గత నెల 27న విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో తప్పులు ఉన్న వారు ఫారం-7 ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్, బీఎల్‌ఓలు ఉన్నారు.

హాలహర్వి: మండలంలోని విరుపాపురం, కుర్లేహళ్లి, సిద్దాపురం గ్రామాల్లో ఆదివారం పోలింగ్ బూత్‌లలో ఓటరు నమోదు శిబిరాలను తహసీల్దార్ మల్లికార్జున పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి ఫారం-6, 7, 8 ద్వారా వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. సాయంత్రం 5 గంటల వరకు శిబిరాలు కొనసాగాయి. వీఆర్వో ఆంజనేయులు, బీఎల్‌ఓ వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, బిణిగేరి, నగరూరు, శంకరబండ గ్రామాల పోలింగ్ బూత్‌లలో ఓటరు నమోదు శిబిరాలను ఆదివారం డీటీ గాయత్రీ పరిశీలించారు. డీటీ మాట్లాడుతూ.. మండలంలోని 65 పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకుంటున్నట్లు తెలిపారు.

చిప్పగిరి: 2024 సాధారణ ఎన్నికల్లో భాగంగా ఆయా గ్రామాలలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అధికారులు చేపట్టి పూర్తి చేశారు. ఈ సందర్భంగా 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు గ్రామాలలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఓటరు జాబితా సవరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మండలంలోని దౌల్తాపురం గ్రామంలో బూత్ లెవల్ ఆఫీసర్ రంగన్న ఓటరు జాబితా సవరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

గోనెగండ్ల: ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ వేణుగోపాల్ కోరారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం గోనెగండ్లలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కుకు దరఖాస్తుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఓటర్ల జాబితాలో తప్పుల సవరణతో పాటు ఓటర్ల వివరాల్లో తప్పులు ఉంటే సవరణలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.